క్లుప్తంగా

పరామర్శ



పరామర్శిస్తున్న మాజీమంత్రి ఐకేరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్

తానూరు: మండలంలోని ఎల్వి గ్రామానికి చెందిన విలేకరి యాతలం గంగారెడ్డి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మాజీమంత్రి ఐకేరెడ్డి, ముథోల్ మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్ సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబీకులతో మాట్లాడి ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందేలా చూస్తామన్నారు. నాయకులు శంకర్ చంద్రే, మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పుండలిక్, మాధవ్ రావ్ పటేల్, పోతారెడ్డి తదితరులు ఉన్నారు.

లోకేశ్వరంలో..

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్ గ్రామానికి చెందిన తూర్పులక్ష్మణ్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. ఎమ్మెల్యే రామారావు పటేల్ సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు పోతన్న, జయసాగర్‌రావు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



మొక్క నాటుతున్న అధికారులు

కుంటాల: పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్ పేర్కొన్నారు. వన మహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో సోమవారం మొక్కలు నాటారు. పంచాయతీ కార్యదర్శి రాజబాపు, ఉపాధ్యాయుడు ప్రవీణ్ కుమార్, టీపీ జైసింగ్, ఎఫ్ఏ రాజేశ్వర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

దస్తురాబాద్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఇన్‌చార్జి ఎస్సై శంకర్ సూచించారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్, పెర్కపల్లే ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దుర్గం మల్లేశ్, నాయకులు రాజేశం, రంజిత్, రాజన్న తదితరులు ఉన్నారు.

విద్యుత్ లైన్ మార్చాలని వినతి



ట్రాన్స్‌కో ఏఈ బాలయ్యకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

మామడ: ఇళ్లపై నుంచి వెళ్తున్న 11కేవీ విద్యుత్ లైన్ మార్చాలని మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన పలువురు గ్రామస్తులు ట్రాన్స్‌కో ఏఈ బాలయ్యకు సోమవారం వినతిపత్రం అందించారు. ఇనుప విద్యుత్ స్తంభాలు తుప్పుపట్టి పడిపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ విద్యుత్ లైన్ పూర్తిగా తొలగించి ప్రధాన రహదారి వెంట వేయాలని కోరారు. మోతే ఆశన్న, ముండ్ల నరేశ్, అలీమ్ తదితరులు ఉన్నారు.

తేనెటీగల దాడిలో ఐదుగురికి గాయాలు

ఖానాపూర్: తేనెటీగల దాడిలో ఐదుగురు మున్సిపల్ సిబ్బందికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలోని పార్కులో గల నర్సరీ నుంచి ట్రాక్టర్‌లో మొక్కలు తరలించేందుకు సోమవారం సిబ్బంది సురేశ్, రమేశ్, రాధ శంకరమ్మ, లక్ష్మి వెళ్లారు. పార్కులోని చెట్లపై ఉన్న తేనెతెట్టెల నుంచి ఒక్కసారిగా లేచి సిబ్బందిపై దాడి చేయడంతో స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రమాదం లేదని వైద్యులు పేర్కొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

నిర్మల్‌చైన్‌గేట్: బీడీ కార్మికుల పిల్లలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఉపకార వేతనాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వైద్యాధికారి మహేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైనవారు ఆగస్టు 31లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

తనిఖీ బృందాలకు సహకరించాలి

లోకేశ్వరం: గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం సభ్యులకు అందరూ సహకరించాలని ఎంపీడీవో సోలమాన్ రాజ్ పేర్కొన్నారు. స్థానిక రైతువేదికలో డీఆర్పీలు, కార్యదర్శులు, ఉపాధి హామీ టీఏ, ఎఫ్ఏలకు సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మంగళవారం నుంచి గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ నిర్వహిస్తామన్నారు. ఏస్పార్పీ సురేందర్, ఏపీవో జగన్నాథ్ పాల్గొన్నారు.

కష్టాల్లో కార్యదర్శులు



కుంటాలలో ఎంపీడీవో రహీంకు వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు(ఫైల్)

- పంచాయతీలకు నిధులు విడుదలలో జాప్యం
- వ్యక్తిగతంగా ఆర్థికభారం

కుంటాల: పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. విధుల్లో చేరినప్పటి నుంచి పనిభారం.. ఆపై వ్యక్తిగతంగా ఆర్థిక భారం పడడంతో వారికి కష్టాలు మొదలయ్యాయి. పంచాయతీలకు ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో కార్యదర్శులపై వ్యక్తిగతంగా ఆర్థికభారం పడుతోంది. సొంత డబ్బులు వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పారిశుధ్య కార్మికులకు సకాలంలో వేతనాలు ఇవ్వడం లేదు. మండలంలో మొత్తం 15 పంచాయతీలు ఉండగా, 11 పంచాయతీల్లో కొందరు కార్మికులు పనులకు రావడం లేదు. ప్రతినెలా ట్రాక్టర్ ఈఎంఐ, సీసీచార్జీలు చెల్లించలేని పరిస్థితి. సభలు, సమావేశాల నిర్వహణ కష్టంగా మారింది. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీవో, డీపీవో, కలెక్టర్‌కు కార్యదర్శులు వినతిపత్రాలు అందజేస్తున్నారు. ఆర్థికపరమైన పనులకు తమ జేబు నుంచి ఖర్చు చేయాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు. ప్రభుత్వం పంచాయతీలకు నిధులు విడుదల చేసి ఆర్థికభారం తగ్గించాలని వారు కోరుతున్నారు.

విధులు, నిర్వహణ

పరిపాలన సంక్షేమం, అభివృద్ధికి గ్రామాల పంచాయతీల కార్యదర్శులది ముఖ్య విధులు, పంచాయతీల రికార్డుల నిర్వహణ, పన్నుల వసూళ్లు, గ్రామసభల సమావేశాలు నిర్వహించడం, పంచాయతీ భవనాలు ఆస్తులు పరిరక్షించడం, ఆరోగ్యం, పారిశుధ్యంపై ప్రత్యేకశ్రద్ధ పెట్టి ఎప్పటికప్పుడు అధికారులకు నివేదిస్తారు. జననం, మరణ రిజిస్టర్ల నిర్వహణ, అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు, రైతులు, మహిళలను ఆర్థిక తోడ్పాటుకు ప్రోత్సహించడం, ఎన్నికల విధులు, వన మహోత్సవం..ఇలా గ్రామ ప్రభుత్వ కార్యకలాపాలను విజయవంతం చేస్తూ విధులు నిర్వహిస్తున్నారు. ఇలా చేస్తున్న వారికి భద్రత లేకుండా పోయిందని వాపోతున్నారు.

చర్యలు చేపట్టాలి



పంచాయతీ కార్యదర్శులు సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా స్పందించి చర్యలు చేపట్టాలి.

– సతీశ్, పంచాయతీ కార్యదర్శి, అంబకటి తాండా

ఆర్థికభారం తగ్గించాలి



పంచాయతీలకు సకాలంలో నిధులు విడుదల కావడం లేదు. సొంత డబ్బులతో ఆర్థికపరమైన పనులు చేయించాల్సి వస్తుంది. పారిశుధ్య కార్మికులకు వేతనాలు అందడం లేదు. ట్రాక్టర్ ఈఎంఐ, సీసీ చార్జీలు చెల్లించడం ఇబ్బందిగా మారింది. ఆర్థికభారం తగ్గించాలి.

– సారిక, పంచాయతీ కార్యదర్శులు మండల కన్వీనర్

ఉన్నతాధికారుల దృష్టికి..



పంచాయతీకి నిధులు విడుదలలో కాస్త జాప్యం జరుగుతోంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషిచేస్తాం.

– ఎంఏ రహీం, ఎంపీడీవో

రోడ్లు అధ్వానం..



కంకర తేలిన సేవాలాల్ తండా నుంచి సాథ్‌గాం వెళ్లేదారి

- కంకర తేలి.. గుంతలు పడి
- ఇక్కట్లు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

లోకేశ్వరం: మండలంలోని గ్రామీణ రోడ్లు అధ్వానంగా మారాయి. హవర్గ నుంచి సాథ్‌గాం రోడ్డు 15 ఏళ్ల క్రితం నిర్మించారు. కంకర తేలి, గుంతలమయంగా మారింది. రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారు. అయినా రోడ్డుకు మరమ్మతు చేపట్టాల్సిన అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. లక్ష్మీనగర్ నుంచి సాథ్‌గాం రోడ్డుపై నిత్యం వందల సంఖ్యలో వాహనాలు, బైక్‌లు రాకపోకలు సాగిస్తుంటాయి. వర్షాలకు ఎక్కడపడితే అక్కడ రోడ్డుపై గుంతలు పడ్డాయి. భారీ వరదలకు కోతకు గురయ్యాయి. వాహనదారులు ఓ గుంతను తప్పించే క్రమంలో అదుపు తప్పి కింద పడిపోతున్నారు. రాత్రివేళ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని వాపోతున్నారు.

నామమాత్రంగా..

ఈ రోడ్లపై ప్రయాణం సాగిస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. గతంలో నామమాత్రంగా మరమ్మతు నిర్వహించినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు తెలిపినా పట్టించుకోలేదని ప్రజలు మండిపడుతున్నారు. రోడ్లపై కేజీవీల్స్ ట్రాక్టర్లు వెళ్తుండడంతో గుంతలు ఏర్పడి అధ్వానంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లకు వెంటనే మరమ్మతు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

లక్ష్మీనగర్ నుంచి సాథ్‌గాం రోడ్డుపై గుంతలు పడ్డాయి. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఇదివరకే ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే వెంటనే మరమ్మతు చేపడుతాం.

– రఘువంశీ, పీఆర్ ఏఈ, లోకేశ్వరం

అంగన్‌వాడీ బాట ర్యాలీ



సోన్: ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



భైంసారూరల్: వానల్‌పాడ్‌లో ర్యాలీ



కుంటాల: విద్యార్థులతో ర్యాలీ తీస్తున్న టీచర్లు

భైంసారూరల్: అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. కేంద్రాల్లో చిన్నారులను చేర్పించాలని మాజీ ఎంపీపీ కల్పన పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి గాయిత్రి, నాయకులు ఈశ్వర్, శ్రీనివాస్, రాంకుమార్, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు ఉన్నారు.

లోకేశ్వరం: మండల కేంద్రంలోని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి పిల్లలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. గ్రామ కార్యదర్శి వినయ్‌సాయి, అంగన్‌వాడీ కార్యకర్తలు సునీత, సుజాత, సురేఖ ఉన్నారు.

కుంటాల: మండల కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీవిశారద ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం చంద్ర నాగాకాంత్, అంగన్‌వాడీ టీచర్లు రాణి, గుణసుందరి, ఆశ కార్యకర్తలు దేవకి, లక్ష్మి, పోషకులు పాల్గొన్నారు.

సోన్: గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు పద్మ, సునీత, సమీణ, సుధారాణి, అనురాధ, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, ఉపాధ్యాయులు శాంతికుమార్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఖానాపూర్: బడీడు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని రాజీవ్‌నగర్ అంగన్‌వాడీ టీచర్ ఆర్.విజయలక్ష్మి, సత్తన్‌పల్లి టీచర్ దేవిక అన్నారు. పట్టణంతో పాటు సత్తన్‌పల్లి గ్రామంలో సోమవారం అమ్మమాట అంగన్‌వాడీ బాట ర్యాలీ నిర్వహించారు. స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

తానూరు: మండలంలోని ఎల్వి గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిన్నారులతో ర్యాలీ నిర్వహించారు. చిన్నారుల వివరాలను సేకరించి అంగన్‌వాడీలో చేర్పించినట్లు టీచర్ సులోచన తెలిపారు. ఈనెల 15 నుంచి 20వ తేదీ వరకు అమ్మమాట–అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం కొనసాగుతుందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మి, గంగామణి, ప్రేమల ఉన్నారు.



లోకేశ్వరం: ర్యాలీలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్



తానూరు: ఎల్వి గ్రామంలో ర్యాలీ



ఖానాపూర్: రాజీవ్‌నగర్‌లో..

నేరాల నియంత్రణకు చర్యలు



మాట్లాడుతున్న సీఐ నైలు

కుంటాల: నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని భైంసా రూరల్ సీఐ నైలు తెలిపారు. మండలంలోని అందాకూర్ గ్రామంలో సోమవారం వేకువ జామున కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. మైనర్లను ద్విచక్ర వాహనం ఇస్తే తల్లిదండ్రులే బాధపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాని కోరారు. వాహనదారులు ధ్రువీకరణ పత్రాలతోపాటు విధిగా లైసెన్సు కలిగి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని 84 వాహనాలను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. ఇందులో 82 ద్విచక్ర వాహనాలు, 02 ఆటోలు ఉన్నాయని తెలిపారు. మీసేవ ద్వారా ఆన్‌లైన్‌లో జరిమానా చెల్లించి ద్విచక్ర వాహనాలను వదిలి వేసినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఎస్సై రజినీకాంత్, ఏఎస్‌ఐలు రాందాస్, దేవ్‌రావు తదితరులు ఉన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పట్టణ సీఐ, పోలీసులు

నిర్మల్‌రూరల్: విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ సూచించారు. జిల్లాకేంద్రంలోని దీక్ష జూనియర్ కళాశాలలో సోమవారం 'నిర్మల్ పోలీస్..మీ పోలీస్'అనే కార్యక్రమాన్ని ప్రారంభించి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గంజాయి తీసుకోవడం వల్ల వచ్చే అనర్థాలు, మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల కుటుంబాలు ఎలా నష్టపోతాయో కళాజాత ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ఎస్పీ జానకీ షర్మిల ఆలోచనతో వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. యువత, ప్రజలకు పోలీసులు దగ్గర కావడానికి ఈ కార్యక్రమం ఎంతో దోహదం చేస్తుందన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఆర్ఎస్సై రవికుమార్, జిల్లా షీటీం సిబ్బంది పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో..

ఖానాపూర్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ సైదారావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సోమవారం మాదకద్రవ్యాలతో పాటు ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎస్సై లింబాద్రి, ప్రిన్సిపాల్ హామీద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సంతోశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



ప్రహరీని పడగొట్టిస్తున్న అధికారులు

సారంగపూర్: కలెక్టర్ ఆదేశాలతో మండలకేంద్రంలోని జెండాగల్లీ కాలనీలో ఓవ్యక్తి అక్రమంగా నిర్మించిన ప్రహరీని అధికారులు సోమవారం కూల్చివేశారు. అక్రమ నిర్మాణం చేపట్టారని కాలనీకి చెందిన బాలేరు మంగమ్మ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ప్రత్యేకాధికారి పశుసంవర్ధకశాఖ ఏడీ సురేష్ మండల పంచాయతీ అధికారి తిరుపతిరెడ్డి విచారణ చేపట్టారు. తిరుపతిరెడ్డి గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి వెళ్లి అక్రమంగా నిర్మించిన ప్రహరీని కూల్చివేయించారు. ఇరువర్గాల ప్రజలకు ఏఎస్సై వసంత్, పంచాయతీ కార్యదర్శి హర్షవర్ధన్ నచ్చజెప్పారు. కారోబారి ఉమామహేశ్వర్, పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

వర్షంలోనే వారసంత..!



భైంసాటౌన్: పట్టణంలోని మిర్చి మార్కెట్ రోడ్డులో ప్రతి సోమవారం వారసంత నిర్వహిస్తారు. గ్రామాల నుంచి, మహారాష్ట్రకు చెందిన రైతులు కూరగాయలు తెచ్చి విక్రయిస్తుంటారు. ఇక్కడ వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం సాయంత్రం కురిసిన వర్షంలోనే వ్యాపారులు తడుస్తూ విక్రయించారు. రోడ్డుపై పారే మురుగునీరు చేరుతుండడంతో వ్యాధుల భయం లేకపోలేదని కొనుగోలుదారులు ఆందోళన చెందుతున్నారు.

పోస్టర్ మేకింగ్ పోటీలు



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో డీఈవో

నిర్మల్ రూరల్: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు 'మహిళా సాధికారత, ఆరోగ్యవంతమైన జీవితం' అనే అంశాలపై సోమవారం పోస్టర్ మేకింగ్ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పోస్టర్ మేకింగ్ పోటీలతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. విద్యార్థులు పాఠశాలస్థాయి నుంచి ప్రణాళికతో చదివి, ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. చదువుతోపాటు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. ఈ పోటీలకు జడ్జిగా అసిస్టెంట్ ప్రొఫెసర్ రవికుమార్, డీఆర్పీ వనజ వ్యవహరించారు. జిల్లా నుంచి 92 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. మొదటి బహుమతి జెడ్పీహెచ్‌ఎస్ నర్సాపూర్(జి) పాఠశాలకు చెందిన ఉదయ్ కుమార్(9వ తరగతి), రెండో బహుమతి ఎం.విజయలక్ష్మి, (9వ తరగతి, కేజీబీవీ జాం), మూడో బహుమతి మల్లేశ్వరి(9వ తరగతి, కేజీబీవీ నిర్మల్ అర్బన్) గెలుచుకున్నారు. వీరికి ప్రశంసాపత్రం అందించారు. ఇందులో జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ పద్మ, కేజీబీవీ జిల్లా అధికారి సలోమి కరుణ, జిల్లా సైన్స్ అధికారి వినోద్‌కుమార్, ఎంఈవో శంకర్, సెక్టోరియల్ అధికారి నరసయ్య, ఎస్‌వో లతాదేవి పాల్గొన్నారు.

కుర్చీలు విరాళం

మామడ: మండల కేంద్రంలోని జెడ్పీ సెకండరీ పాఠశాలకు 2006–07 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు సోమవారం కుర్చీలను విరాళంగా అందజేశారు. రూ.15 వేలతో కొనుగోలు చేసిన కుర్చీలు అందించినట్లు తెలిపారు. హెచ్‌ఎం నరసింహస్వామి, ఉపాధ్యాయుడు చక్రధర్ ఉన్నారు.

ఘనంగా గురుపూజోత్సవం

కుభీర్: మండల కేంద్రంలోని విఠలేశ్వర మందిరంలో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో సోమవారం గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కార్యదర్శి అరుణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు దేశాన్ని ధర్మాన్ని కాపాడాలన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పోశెట్టి, శివలింగం, శ్రీనివాస్, గంగారెడ్డి, గంగయ్య, బాలాజీ సేట్, పి.పిరాజి తదితరులు ఉన్నారు.

సంక్షిప్తంగా

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు

ముథోల్: మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సాయికిరణ్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని వాహనదారులకు సోమవారం అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని పేర్కొన్నారు.

రేపు లక్ష తులసి అర్చన

నిర్మల్‌చైన్‌గేట్: శయన ఏకాదశి(తొలిఏకాదశి) పురస్కరించుకొని బుధవారం స్థానిక దేవరకోట శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సాయంత్రం 5.30 గంటలకు లక్ష తులసి అర్చన, సహస్రదీపారాధన, అన్నమాచార్యు గీతాల స్వరార్చన కార్యక్రమాల నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ ఆమెడ శ్రీధర్ తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

పంట వివరాలు నమోదు చేసుకోవాలి

ముథోల్: రైతుల పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు తప్పనిసరని ఏఈవో ప్రవీణ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని శ్రీ పశుపతినాథ్ ఆలయం వద్ద సోమవారం పంటల వివరాలను నమోదు చేసుకున్నారు.

సన్మానం

లక్ష్మణచాంద: లక్ష్మణచాంద పీహెచ్‌సీలో 13 ఏళ్లుగా సేవలందించిన ఏఎన్‌ఎం సుగుణ పదోన్నతిపై కుభీర్ పీహెచ్‌సీ సూపర్‌వైజర్‌గా బదిలీయ్యారు. ఈ సందర్భంగా సుగుణ–సూర్యకుమార్ దంపతులను ఆశ కార్యకర్తలు సోమవారం సన్మానించారు. ఏఎన్‌ఎం యాస్మీన్, ఆశ కర్యకర్తలు శారద, లక్ష్మి, విజయ, రత్నమాల, భూదేవి, లక్ష్మి ఉన్నారు.

పునరావాస గ్రామస్తులతో సమావేశం



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీవో

కడెం: మండలంలోని కొత్తమద్దిపడగ సమీపంలోని రాంపూర్, మైసంపేట్ పునరావాస కాలనీవాసులతో ఆర్డీవో రత్నకళ్యాణి సోమవారం సమావేశమయ్యారు. పునరావాస ప్యాకేజీలో భాగంగా అందజేసిన సాగు భూమిలో పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. చదును చేయించడం, త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం, బావులు తవ్వించే వరకు సాగు పనులు చేపట్టమని, పాత గ్రామాల్లోని వ్యవసాయ భూముల్లో సాగు చేస్తామని గ్రామస్తులు తెలిపారు. దీంతో ఆర్డీవో అక్కడి నుంచి వెళ్లిపోయారు. తహసీల్దార్ సుజాత, తదితరులు ఉన్నారు.